నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com

డీఎంహెచ్ఓగా డాక్టర్ నరేందర్ బాధ్యతలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వైద్యారోగ్యా శాఖ నూతన అధికారిగా డాక్టర్ నరేందర్ రాథోడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కుష్టు నివారణ అధికారి గజానన్, డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్‌రావు, రమేష్, సూపరింటెండెంట్ గోపి, సీసీ కిరణ్‌తో పాటు పలువురు ఉద్యోగులు కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు ఉద్యోగులు సహకారం అందించాలని డిఎంహెచ్ఓ పేర్కొన్నారు. ఇటీవల డిఎంహెచ్ఓగా విధులు నిర్వర్తించిన కృష్ణను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మళ్లీ ఇదివరకు ఇక్కడ పనిచేసిన నరేందర్‌ను నియమించారు.



రోడ్డు ప్రమాదంలో మెకానిక్ మృతి

నవతెలంగాణ-కాసిపేట

దేవాపూర్ లారీ యార్డ్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ చేదం తిరుపతి(26) అక్కడికక్కడే మృతి చెందినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం..శనివారం ఉదయం దేవాపూర్ గ్రామానికి చెందిన తిరుపతి చింతగూడ గ్రామం నుంచి తన మోటార్ సైకిల్‌పై వస్తుండగా దేవాపూర్ లారీ యార్డ్ వద్ద ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు వెనుక నుండి ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శివకృష్ణ



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలోని రైతులంతా ఇకపై సేంద్రీయ వ్యవసాయం చేసేలా దృష్టి సారించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ శివకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గోనె శ్యాంసుందర్‌రావు గోశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులతో చేస్తున్న వ్యవసాయంలో భూమి, నీరు, గాలితో పాటు పర్యావరణ కలుషితమైపోతున్నట్లు వివరించారు. భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగితే రాబోయే తరాలకు విషతుల్యమైన పర్యావరణాన్ని అందించిన వారమవుతామని అన్నారు. అంతేకాదు మానవ మనుగడ అంతరించేందుకు కూడా కారణం అవుతామని తెలిపారు. గాలి, నీరు, భూమి విషతుల్యం కాకుండా సేంద్రీయ వ్యవసాయం విధిగా చేసేలా రైతులు చైతన్యం కావాలన్నారు. అనంతరం ఎఫ్‌పీసీ సలహాదారుడు గోనె శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ ప్రతి రైతు తనకు భూమిలో కనీసం ఓ గుంటలో కాయగూరల సాగు చేసి తమ కుటుంబ అవసరాల కోసం సేంద్రీయ వ్యవసాయం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఎఫ్‌పీసీ డైరెక్టర్లు పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, సేంద్రీయ రైతులు శ్రీనివాస్, కిషన్, రాచకొండ చందన, బొడ్డు భూమయ్య, అర్జున్ పలువురు రైతులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్ సిద్ధం చేయాలి



నవతెలంగాణ-జైపూర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ అన్నారు. శనివారం ఆయన పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో పాటు సంబంధిత అన్ని సూచికలను పర్యవేక్షించాలని తెలిపారు. అసంక్రమణ, సంక్రమణ వ్యాధులు, పిల్లలకు టీకాలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రం ద్వారా పంపిస్తున్న పరీక్షలకు సంబంధించిన శ్యాంపుల్స్ రికార్డుల తీరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో డిస్‌ప్లే చేసిన ఈఈసీ పోస్టర్లు సరైన రీతిలో పెట్టి అవగాహన కల్పించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా మాస్ మీడియా అధికారి, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

జీఎంగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

ఎస్ఓటు జీఎంగా పని చేసి జీఎంగా ఉద్యోగోన్నతిపై భూపాలపల్లికి వెళ్తున్న రాజేశ్వర్‌రెడ్డిని ఏరియా ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. జీఎం దేవేందర్, ఏరియా ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు శనివారం జీఎం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాకి రాజేశ్వర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా ప్రాజెక్ట్ ఆఫీసర్లు, డీజీఎంలు, హెచ్ఓడీలు, ఏజెంట్లు, జీఎం కార్యాలయ అధికారులు, గనులు, డిపార్ట్మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

నేడు టీయూటీఎఫ్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) ప్రస్తుత జిల్లా కార్యవర్గం పదవీకాలం ముగిసినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 3న ఆదివారం ఉదయం 10గంటలకు పట్టణంలోని డైట్ కళాశాలలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దుచేసి నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కూలీల కొరత..!

- పత్తి ఏరేందుకు దొరక్కరైతుల తిప్పలు
- మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్న అన్నదాతలు
- కిలోకు రూ.8చొప్పున చెల్లిస్తున్నా తీరని సమస్య
- విక్రయించిన పత్తికి మార్కెట్‌లోనూ ధర రాక దిగులు
- పెట్టుబడి ..ఆదాయం సమానమవుతోందని ఆవేదన

అన్నదాతలను కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పత్తి ఏపుగా కాసి సిద్ధంగా ఉన్నా..దానికి ఏరేందుకు కూలీలు దొరక్కపోవడం రైతులను తీవ్ర తిప్పలకు గురిచేస్తోంది. స్థానికంగా ఎవరి పొలంలో వారు పత్తి ఏరేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇతరుల పొలంలోకి వెళ్లేందుకు సమయం పట్టే అవకాశం ఉండటంతో అప్పటి వరకు రైతులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తెప్పించి పత్తి ఏరిపిస్తున్నారు. సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి కూలీలను తెప్పిస్తున్నారు. కిలో పత్తి ఏరేందుకు రూ.8చొప్పున చెల్లిస్తున్నారు. కానీ కొన్ని చోట్ల మాత్రం కూలీలు కిలో రూ.10చొప్పున ఇవ్వడంతో పాటు రవాణా ఛార్జీలు చెల్లించాలని డిమాండ్లు విధించడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సకాలంలో కూలీలు లభించకపోవడం మూలంగా పత్తి కిందపడిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే పత్తి పంటకు ప్రధాన కేంద్రంగా భావిస్తారు. ఇక్కడ పండించే పత్తికి అంతర్జాతీయంగానూ మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు ఈ పంట మీదనే ఆధారపడుతుంటారు. కానీ పత్తి గింజలు పొలంలో నాటిన నుంచి పంట చేతికొచ్చి పంట ఏరే వరకు రైతులు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. పత్తి పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్‌కు తీసుకెళితే అక్కడా గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో అనేక మంది రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పులపాలవుతున్న సందర్భాలున్నాయి. తాజాగా పత్తి ఏరేందుకు కూలీలు లభించకపోవడం వారిని మరింత తీవ్రంగా వేధిస్తోంది. స్థానికంగా ఉన్న వ్యవసాయ కూలీలు సొంత పొలానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఇతర రైతుల పత్తి ఏరేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు గ్రామాల రైతులు సమీపంలోని మహారాష్ట్రకు వెళ్లి అక్కడి కూలీలను తీసుకొస్తున్నారు. ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తీసుకొచ్చి కిలో రూ.8చొప్పున చెల్లించి పత్తిని ఏరిపిస్తున్నారు. కానీ కొన్ని చోట్ల మాత్రం కిలో రూ.10 వరకు చెల్లించడంతో పాటు రవాణా ఛార్జీలు సైతం భరించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే మార్కెట్‌లో సరైన ధర లేదు.. దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వస్తోంది. కూలీలకే క్వింటాల్‌కు రూ.వెయ్యి చెల్లించే తమకు మిగిలేది ఏమిటని మదనపడుతున్నారు. మరోపక్క కొందరు రైతులు కూలీలను తీసుకొచ్చి వారికి భోజనం పెట్టడంతో పాటు వసతి సౌకర్యం కల్పించి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

ధర లేక..దిగుబడి రాక..!

పత్తి పంట పండిస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సరైన దిగుబడి రాక..మార్కెట్‌లోనూ సరైన ధర రాక దిగులు చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7521 ధర నిర్ణయించగా.. ఆదిలాబాద్‌లో ప్రయివేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.7130 వరకు చెల్లిస్తున్నారు. తేమశాతం 12దాటితే ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలుకు నిరాకరిస్తుండగా.. ప్రయివేటు వ్యాపారులు 8 శాతం నుంచి కిలో చొప్పున కోత విధిస్తున్నారు. ఒక్కో రైతుకు పత్తిలో సాధారణంగా 15 నుంచి 20శాతం వరకు తేమ చూపిస్తుండటంతో కిలో రూ.71 చొప్పున కోత విధిస్తుండటంతో 20శాతం తేమకు రూ.6618వరకు మాత్రమే ధర వస్తోంది. దీంతో ఒక్కో రైతు క్వింటాల్‌కు ప్రభుత్వ ధరతో పోల్చితే రూ.900 వరకు నష్టపోవాల్సి వస్తోంది. మరోపక్క ఒక కూలీ క్వింటాల్ పత్తి ఏరితే రూ.800 వరకు చెల్లిస్తున్నారు. దీంతో ఒక్కో రైతు క్వింటాల్‌కు తేమ, కూలీ కలిపితే రూ.1700వరకు నష్టపోతున్నారు. ఇలా మొత్తం ప్రభుత్వ ధరతో పోల్చి చూస్తే ఒక్కో రైతుకు క్వింటాల్ పత్తికి రూ.5820 మాత్రమే వస్తోంది. దీంతో రైతులు ఎకరానికి సుమారు రూ.40వేల వరకు ఖర్చు పెడుతున్నారు. ఎకరానికి 6 నుంచి 8క్వింటాల్‌ల వరకు దిగుబడి వస్తోంది. ఈ లెక్కన 8క్వింటాల్ పత్తి విక్రయిస్తే రైతులకు కేవలం రూ.40వేల పైన మాత్రమే వస్తుంది. ఇటు పెట్టుబడి..అటు పత్తి అమ్మిన ధర సరిసమానమవుతోంది. దీంతో పంటలో ఆదాయం లేకపోవడంతో అన్నదాతలకు ఏటా అప్పులపాలు కావడం తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం :
పోశెట్టి, రైతు, లోకారి



పత్తి ఏరేందుకు కూలీలు దొరక్కపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సకాలంలో ఏరిపించేకపోతే పత్తి కిందపడిపోయే అవకాశం ఉంటుంది. దీంతో రైతులు కిలోకు రూ.8చొప్పున చెల్లించి ఏరిపిస్తున్నారు. కానీ కూలీలు దొరకకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వంతుల వారీగా కూలీలను మాట్లాడుకుంటున్నారు.

రసాభాసగా సమగ్ర సర్వే సమావేశం

- రెండు గ్రూపుల మధ్య తోపులాట
- పలువురికి గాయాలు
- శ్యాంనాయక్ నిరసన, అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశం రసాభాసగా ముగిసింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్చార్జి శ్యాంనాయక్‌కు చెందిన రెండు గ్రూపుల మధ్య తోపులాట జరిగి ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకోవడంతో పాటు దాడి చేసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేపై ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్‌తో పాటు జిల్లాలోని రెండు నియోజకవర్గాల ముఖ్య నాయకులు పాల్గొనగా కార్యకర్తల గొడవతో ఉద్రిక్తత చోటుచేసుకుని రసాభాసగా తయారైంది.

గొడవ మొదలైందిలా..

కొంతకాలంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆధిపత్య పోరు కొనసాగుతుండగా శనివారం బహిర్గతం అయింది. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అధ్యక్షత వహించగా తమ గ్రూపుకు సమాచారం లేకుండా సమావేశం నిర్వహించడం ఏంటని శ్యాం నాయక్‌తో పాటు ఆయన మద్దతుదారులు ప్రశ్నించారు. దీంతో గొడవ ప్రారంభమై ఒకరినొకరు కొట్టుకునే వరకు వెళ్లింది.

పలువురికి గాయాలు

గొడవలో కుర్చీలు విసురుకోవడంతో పాటు ఒకరినొకరు కొట్టుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. శ్యాంనాయక్ గ్రూపుకు చెందిన గజ్జల సత్తయ్య గాయపడగ, విశ్వప్రసాద్ గ్రూపుకు చెందిన ఒకరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు.

శ్యాంనాయక్ నిరసన,అరెస్ట్

తమకు సమాచారం లేకుండా సమావేశం నిర్వహించడంతో పాటు తమ గ్రూపు నాయకులపై దాడి చేసిన తిర్యాణి మండలానికి చెందిన అనిల్‌గౌడ్‌ను బహిష్కరించాలంటూ రోజ్ గార్డెన్ గేటు ఎదుట శ్యాంనాయక్ నిరసన తెలిపారు. డీఎస్పీ కరుణాకర్ అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వెనక్కి తగ్గకపోవడంతో అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏదేమైనా కాంగ్రెస్‌లో కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆధిపత్య పోరు బయటపడడంతో పాటు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



గొడవ పడుతున్న ఇరు గ్రూపుల నాయకులు



నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం



రోజ్ గార్డెన్ ముందు బైటాయించిన శ్యాంనాయక్, మద్దతుదారులు

కులగణన సర్వేతో సామాన్య కుటుంబాలకు మేలు

నవతెలంగాణ-మంచిర్యాల

సమగ్ర కులగణన సర్వేపై వివిధ కుల సంఘాలు, రాజకీయ నాయకుల అభిప్రాయాలను పార్టీ పెద్దలకు తెలియజేస్తామని, తద్వారా కుటుంబాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన కుల గణన సమగ్ర కుటుంబ సర్వేపై అన్ని కులాలు, రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా అన్ని కులాల కుటుంబాల ఆర్థిక స్థితి గతులు, విద్య, ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయనేది తెలుసుకుంటామని తెలిపారు. దాని ద్వారా కుటుంబ సభ్యుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కుల గణన సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్వే ద్వారా పేద మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేపై అన్ని కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ సురిమిల్ల వేణు, కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం ఎదుట యాదవుల ఆందోళన



ఆదిలాబాద్‌టౌన్ : డీఎస్సీ-2024 నియామకాల్లో డీఈవో కార్యాలయంలో అక్రమాలు జరిగాయని, అనర్హులకు పోస్టింగ్ ఇచ్చి విధుల్లో చేరిన అభ్యర్థులకు అన్యాయం చేశారని యాదవ సంఘం నాయకులు ఆరోపించారు. ఈ విషయమై శనివారం సంఘం ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తలమడుగు మండలం కుచులాపూర్‌లో ఉపాధ్యాయుడిగా నియామకమైన నవీన్ యాదవ్‌ను రోస్టర్‌లో దొర్లిన పొరపాటుతో సర్వీస్ నుండి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అనంతరం యాదవులు కలిసి డీఈవోను కలిసి వినతిపత్రం అందజేసి ఆ తర్వాత కలెక్టర్ రాజర్షి షాను కలిసి అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హన్మండ్లు యాదవ్, నారాయణ యాదవ్, రామన్న యాదవ్, ప్రఫుల్, దేవారెడ్డి, రవికాంత్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చి జిల్లాకు పతకాలు సాధించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాకు పతకాలు సాధించాలని, ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ అనిల్ ఆకాంక్షించారు. శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ అనిల్ మాట్లాడుతూ జిల్లా ఖోఖో క్రీడాకారులు మంచి ప్రతిభను కనబర్చాలన్నారు. నాణ్యమైన కోచింగ్‌లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు పతకాలు సాధించి తీసుకురావాలని ఆకాంక్షించారు. దానికి అనుగుణంగానే నిత్యం సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ గోవర్ధన్, పేట సంఘం కార్యదర్శి స్వామి, ఎంపికల కన్వీనర్ ప్రతాప్, సత్యనారాయణ, అతుల్, గుండి మహేష్ పాల్గొన్నారు.

గుస్సాడీలకు రూ.35 వేలు విరాళం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని లింగట్ల గ్రామంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సాబ్లే నానాక్ సింగ్ ఇంటి వద్ద దీపావళి పండగ సందర్భంగా శనివారం గుస్సాడీలు భక్తిశ్రద్ధలతో దండారీ నృత్యా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సాబ్లే నానాక్ సింగ్ తరతరాల నుంచి ఎంతో ఘనంగా జరుపుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా దండారీలకు రూ.35వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ సాబ్లే కిషోర్ మల్లేష్ పటేల్, బాపూరావు, లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



పాఠశాలలో దొంగతనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావలలోని ప్రాథమిక పాఠశాల(2)లో దొంగతనం జరిగిన ఘటన వెలుగు చూసింది. పాఠశాల హెడ్ మాస్టర్ విద్యాసాగర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు దీపావళి పండుగ సందర్భంగా రెండు రోజులు సెలవుల అనంతరం శనివారం ఉదయం అంటెండర్ ప్రతిరోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లింది. అయితే పాఠశాల గేటు తాళాలు పగలగొట్టి ఉండటం, సామగ్రి చిందరవందర ఉండటం గమనించిన అంటెండర్ హెచ్‌ఎంకు సమాచారం అందించారు. హెచ్‌ఎం పాఠశాలకు చేరుకొని పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గ్రహించి మావల పోలీసులకు సమాచారం అందించారు. ఈ దొంగతనంలో 12 ఫ్యాన్‌లు, 12 ట్యూబ్ లైట్‌లు, వంటపాత్రలు, 3 రైస్ బ్యాగులు దొంగతనానికి గురికాగా కరెంట్ మీటర్‌తో సహా ఎలక్ట్రికల్ సామాను ఆనవాళ్లు కనిపించకుండా దొంగతనం జరిగినట్లు హెచ్‌ఎం తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా వివరాలు సేకరించి దర్యాప్తు చేపడుతున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

బాధ్యతగా ఓటు హక్కును వినియోగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా బాధ్యతగా తమ ఓటు హక్కును కూడా వినియోగించాలని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని విశ్వశాంతి స్కూల్‌లో స్వీప్ కార్యాలయంలో భాగంగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. దీనికి ఆయన హాజరై పలు విషయాలను తెలియజేశారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు ఎంతో విలువైందని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకోవడమే కాకుండా ప్రతి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించాలన్నారు. గత సంవత్సరంలో ఒకే సారి నమోదుకు అవకాశం ఉండేదన్నారు. కానీ ఇప్పుడు సంవత్సరంలో నాలుగు సార్లు అవకాశం ఇచ్చారన్నారు. జనవరి, జూలై, ఏప్రిల్, అక్టోబర్ నెలలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తమతో పాటు ఇతరులను కూడా ఓటరు నమోదు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ ప్లీనరీ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్



ఈనెల 3న ధర్మ సమాజ్ మొదటి ప్లీనరీని విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ సభ్యుడు కొండమడుగు గణేష్ అన్నారు. శనివారం మండలంలోని సొనాల గ్రామంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదారాబాద్‌లోని అధిభట్లలో నిర్వహించే ధర్మాసమాజ్ మొదటి ప్లీనరీలోని తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల భవిష్యత్తుకు కీలక నిర్ణయాలు ఉంటుందని అన్నారు. అలాగే ఈ ప్లీనరీకి ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 6న జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మిల్కా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళలో కే.ఎల్ గ్రూప్ కంపెనీ పాల్గొంటుందని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి గల యువతీ, యువకులు ఉదయం 11 గంటలకు హాజరై కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులచే ఇంటర్వ్యూలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440586437ను సంప్రదించాలని సూచించారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లా అభివృద్ధి చెందింది : రమేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, పాలన సౌలభ్యం కోసం మాజీ మంత్రి జోగు రామన్న, కేసీఆర్ నాయకత్వంలో సాత్నాల, బోరజ్ మండలాలు ఏర్పాడ్డాయని బీఆర్ఎస్ మాజీ జైనథ్ మండలాధ్యక్షుడు రోకండ్ల రమేష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి జోగు రామన్న కృషి ఫలితంగానే రెండు మండలాలు ఏర్పాడ్డాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న సర్వేలో బోరజ్, సాత్నాలకు మండలాల కోడ్లు ఇవ్వడం హర్షనీయమన్నారు. అదే విధంగా ప్రభుత్వం అక్కడ పరిపాలన సాగించేలా ప్రభుత్వ కార్యాలయాలను త్వరతగతిన ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తుందని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి పర్చడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు తాము పండించిన పంటలను ప్రయివేటు దుకాణాల్లో కాకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో 37 సీఎంఆర్‌ఎఫ్ రూ.8లక్షల 22 వేలు విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ఓ వరమని అన్నారు. సీఎం సహాయ నిధి పథకం ఆపద సమయంలో రోగులకు సంజీవినీలా పని చేస్తోందన్నారు. రోగి అత్యవసర సమయంలో ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును సీఎంఆర్‌ఎఫ్‌ను వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శైలజ రమేష్, సీఈఓ రాజేందర్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, సింగల్ విండో డైరెక్టర్‌లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, పట్టణాధ్యక్షులు వాజిద్‌ఖాన్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, ఎలగడప మాజీ సర్పంచ్ భూమేశ్వర్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్, మల్లయ్య, రాజశేఖర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్లో ట్రస్మా ప్రయివేటు పాఠశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలల యాజమానులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా రాసిస్తే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో కలిసి మండల విద్యాధికారులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు అశన్న, అనిత, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షులు శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధినాథ్, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు నాగన్న, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు కిషన్, రాము, షబ్బీర్, వసంతరావు, రాయిస్, గిరిబాబు, కేశవ్, ఉమాజీ, శివాజీ, సంభన్న, సంజీవ్, మహేందర్, శంకర్, పురుషోత్తం, శివాజీతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

• ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్లు రైతులకు కోత విధిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం కోత విధించవద్దన్నారు. శనివారం భైంసా మండలంలోని దేగాం, వాలేగాం, కుంసరా, ఎగ్గామ్, వానల్‌పాడ్, పెండ్‌పెల్లి గ్రామాల్లో పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి ధాన్యంలో కోత విధించవద్దని, రైతుల పక్షాన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్టు తెలిపారు. అక్రమాల నివారణకు విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యా, వైద్యం, రైతాంగానికి సాగునీరు అందించడమే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని, దశలవారీగా సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. దేగాం గ్రామానికి చెందిన నాయకులు పలు సమస్యలు విన్నవించడంతో సిరాల ప్రాజెక్టు ద్వారా దేగాం రైతాంగానికి సాగునీరు అందిస్తానన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను, పరిష్కరించేందుకు తనవంతుగా పాటు పడతానన్నారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మెన్ ఆమెడ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీంరావు, సాప్లీ రమేష్, మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు సిరం సుష్మ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, గణేష్ పటేల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు దిగంబర్, సాయినాథ్, ప్రసాద్, చందర్ పటేల్, సాయరెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీ, రాజేందర్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు పూర్వవైభవం తీసుకురావాలని డీఈఓ ప్రణీత అన్నారు. శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. దీనికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా స్కౌట్స్ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, ఖర్చుల వివరాలను జిల్లా కార్యదర్శి స్వామి నివేదిక రూపంలో వెల్లడించారు. పలు తీర్మాణాలు చేసి జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్టు కార్యదర్శి వెల్లడించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పిల్లల నమోదును పెంచాలన్నారు. దీని ద్వారా పిల్లలకు జరిగే లాభాలను తెలియజేయాలన్నారు. అదే విధంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. దీనికి తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కంచనపల్లి రత్నకర్, ఉదయశ్రీ, జయశీల, సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మీ, కమిషన్లు శాస్త్రీ, గుండి మహేష్, ట్రెనింగ్ కమిషనర్ నాగిరెడ్డి, స్నేహ, కోశాధికారి కన్నం మోహన్‌బాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణానికి చెందిన పెరమాండ్ల హరీశ్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా విషయం తెలుసుకుని శనివారం ఖానాపూర్ వాసి వడ్డేపల్లి కృష్ణంరాజు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, తల్లి ఉన్నారు. కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఆదుకోవాలని ముందుకు వచ్చానని అన్నారు. కుటుంబానికి భవిష్యత్తులో అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు ఫౌండేషన్ సభ్యులు అడ్డగట్ల రాజన్న, తోట సత్యం, రాజేందర్‌గౌడ్, గోపిగౌడ్, రమేష్ గౌడ్, సిర్ర గణేష్‌గౌడ్, సిలివేరి సత్యనారాయణ, దూడం శ్రీనివాస్, పరంకుశం శ్రీనివాస్, బీసీ రమేష్, పాలిక్ శ్రీనివాస్, సంగర్తి రాజన్న, కొక్కుల ప్రదీప్, శంకర్, సాకేత్, మడిగెల అనిల్ ఉన్నారు.

ఆశాలకు కులగణన సర్వేకు మినహాయింపు నివ్వాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కుల గణన సర్వేలో ఆశాలకు మినహాయింపునివ్వాలని సీఐటీయూ ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షులు పి.గంగామణి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆశా కార్యకర్తలు, డీఎంహెచ్‌ఓతో పాటు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క స్కూల్ టీచర్స్‌కు ఈ సర్వేలు చేయాలని చెప్పినప్పటికీ అధికారులు ఆశాలచే ఎందుకు చేయిస్తున్నారని అన్నారు. తక్షణమే ఈ సర్వేల నుంచి ఆశ వర్కర్లకు మినహాయింపునివ్వాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ గౌరవాధ్యక్షురాలు బి.సుజాత, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అనసూయ, విజయ, ఇంద్రమాల, భాగ్య, కోశాధికారి రామలక్ష్మి సభ్యులు నంద, సరిత, శారద, విజయ, సుజాత, ముత్తవ్వ, గోదావరి, రాధా, లక్ష్మి, రాజేశ్వరి, పద్మ సుగుణ, జ్యోతి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ హదీ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు జామ్, యాకర్‌పల్లి, కౌట్ల(బి) జౌలి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తెచ్చి విక్రయించాలన్నారు. మొదటి రకానికి క్వింటాలుకు రూ.2,320, రెండో రకానికి రూ.2,300 మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, సొసైటీ సీఈఓ సలీం, మార్కెట్ డైరెక్టర్లు పోతారెడ్డి, బట్టు భోజన్న, నాగరావ్, నేలకొండ శ్రీనివాస్, రాథోడ్ పుష్ప, ధనసింగ్, నాయకులు నవీన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, లస్మన్న, రాజు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-కుబీర్



వివిధ కారణాలు, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా ఉండేందుకే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద వైద్య ఖర్చులను భరిస్తుందని, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రంజిని గ్రామానికి చెందిన పుప్పాల హరిచరణ్‌కు ఇటీవల కాలుకు గాయం కావడంతో అస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.38,300ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని అన్నారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్ మంజూరు చేసిన ముఖ్యమంత్రికి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శంకర్ చావాన్ నాయకులు తూము రాజేశ్వర్, మాజీ సర్పంచులు దత్తుగౌడ్, దత్తురాం, పటేల్ హైమద్ పాషా, మాజీ ఎంపీటీసీలు హనుమండ్లు, కార్యకర్తలు ఉన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఓడ్ కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాలుంకే శంకర్ అన్నారు. శనివారం దీపావళి పండుగను పురస్కరించుకొని గంగానది స్నానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ పూర్వీకుల నుంచి కొనసాగుతూ వస్తున్న సాంప్రదాయం ప్రకారం నదీస్నానం చేశామన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలు సజీవంగా ఉంచుకునేందుకు మేమంతా ప్రతి సంవత్సరం ఈ పండుగ చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఉదయం నదీ వద్దకు వెళ్లి ఇసుకతో శివలింగాన్ని ఏర్పాటు చేసి గరిక, ధాన్యాలతో పూజ చేస్తామన్నారు. తమ ఓడ్ సమాజ్ బంధువులు అందరూ పరస్పరంగా పండుగ శుభాకాంక్షలు తెలిపి పెద్దల ఆశీర్వాదం తీసుకుంటామన్నారు. అమావాస్య కాలంలో లక్ష్మీపూజ చేస్తారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 6న జరిపే సర్వేలో అందరూ పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడ్ కుల సంఘం అధ్యక్షులు చవాన్ ప్రకాష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com

పాఠశాల పనుల పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని దరోగపల్లి ప్రాథమిక పాఠశాలల పనులను ఎంపీడీఓ ఆల్బర్ట్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అలాగే గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ నెలలో జరిగే కులగణనలో ప్రతి ఒక కుటుంబానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేయించాలని పంచాయతీ కార్యదర్శిలకు సూచించారు.

అటవీ అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు రేంజ్ అధికారుల తీరుపై సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం హైదరాబాద్‌లో అటవీ శాఖా మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సిర్పూరు రేంజ్ పరిధిలోని ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు వారిని చితకబాదారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సిర్పూరు రేంజ్ అధికారి ఇక్బాల్, సెక్షన్ అధికారి సద్దాంలు కావాలనే వారిని అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురి చేశారని మంత్రికి వివరించారు. అటవీ అధికారులు రైతుల వద్ద నుండి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గిరిజన కళాకారులకు ప్రోత్సాహం

- అటవీశాఖ సీఎఫ్ శాంతారామ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు అటవీ శాఖ కృషి చేస్తుందని ఉమ్మడి జిల్లా అటవీ శాఖ కన్జర్వేటర్ శాంతారామ్ అన్నారు. జైనూర్ మండలానికి చెందిన మడవి ఆనంద్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని డీఎఫ్ఓ కార్యాలయంలో జిల్లా ఆటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రివల్‌తో కలిసి ఆనంద్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ సహకారంతో గిరిజన కళాకారులకు ఆర్థిక తోడ్పాటును అందించడంతో అటవీశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో జిల్లాకు చెందిన కళాకారుడు అత్యంత కళా ప్రదర్శనను ప్రదర్శించిన చిత్రాలకు గుర్తింపు లభించిందని తెలిపారు. జిల్లాలోనూ గిరిజన కళాకారులకు వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందన్నారు. గిరిజనులోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. గిరిజనుల సాంప్రదాయాలపై కళాత్మక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకుంటాయన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-బెజ్జూర్

గంగపుత్రుల సమస్యలు పరిష్కారించాలని మండలంలోని సాలెగూడ, బెజ్జూర్ గ్రామాలకు చెందిన గంగపుత్రులు ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. శనివారం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే డీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో వారు కాంగ్రెస్ అధ్యక్షుడికి వినతిపత్రం అందించి సమస్యలను విన్నవించారు. చెరువుల మీద సర్వహక్కులు కల్పించాలని, ఉచిత చేప పిల్లలను అందించాలని, మత్స్యకారులకు సెపరేట్‌గా కార్పొరేషన్ ఏర్పాటు చేసి గంగపుత్రులను చైర్మన్‌గా నియమించాలన్నారు. గంగపుత్రులకు సబ్సిడీ మీద వాహనాలు అందించాలని కోరారు. మత్స్యకారులకు ఇనురెన్స్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, గంగపుత్ర సంఘం సభ్యులు గుమ్ముల బాలయ్య, గుమ్ముల శ్రీనివాస్, సూర్ల సతీష్, మంచెర్ల చిన్నయ్య, మంచెర్ల శ్రీకాంత్, మహేష్, పోషయ్య, సూర్ల బాలయ్య పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడువాయి జిల్లా పరిషత్ పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు 2024 పోస్టర్లను మండల విద్యాధికారి రమేష్ బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రాజాకమలాకర్ రెడ్డి మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులను, సైన్స్ ఉపాధ్యాయులను ఆయన కోరారు. సమాజంలో శాస్త్రీయ ధృక్పథం, శాస్త్ర ప్రచారం పెంపొందించడం, విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి, ప్రావీణ్యతను పెంచడానికి, సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి, శాస్త్రీయ పరిశీలన ఆసక్తులను రేకెత్తించడానికి, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి తోడ్పడే విధంగా సైన్స్ సంబరాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాకేష్, ఉపాధ్యాయులు సంతోష్, శిల్ప, ధృపద, సునీత పాల్గొన్నారు.

గోలేటిలో ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాట్మింటన్ పురుషులు, స్త్రీల ఎంపిక పోటీలను ఈనెల 4న మండలంలోని గోలేటి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో వాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలుంటాయని నిర్వహకులు తెలిపారు. సీనియర్ పురుషులు, స్త్రీలు ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు జరుగుతాయని ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన పురుషులు, స్త్రీలు ఈనెల 08 నుండి 10 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే అంతర్రాష్ట్ర జిల్లాల బాల్ బ్యాట్మెంటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే వారు సెల్: 9391406736, 9381662413 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కోట సతీష్ కుమార్



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుడు కోట సతీష్ కుమార్

నవతెలంగాణ-దహెగాం

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కోట సతీష్ కుమార్ అన్నారు. శనివారం పార్టీ మండల ద్వితీయ మహాసభ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపైన ప్రతి కార్యకర్త సమరశీల పోరాటాలలో పాల్గొనాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ మతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తూ ప్రజా ధనాన్ని కార్పోరేట్ కంపెనీలకు దోచిపెడుతందని మండిపడ్డారు. బీజేపీ దేశ సంపదను లూటీ చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ఆకాంక్షను నెరవేర్చడం లేదన్నారు. అనేక హామీలు ప్రజలకు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు. పోడు భూములకు పట్టాలిస్తాని చెప్పినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటువైపుగా తన ప్రయాణం సాగడం లేదని, పోడు సాగుదరులపై ఫారెస్ట్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. దీన్ని నిరసిస్తూ పోరాటలు కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. నూతన మండల కార్యదర్శిగా నేర్పల్లి అశోక్, మండల కమిటీ సభ్యులుగా దిగిడ బక్కన్న, నల్లి దామోదర్, సిడాం శంకర్, శ్యగాం కమల, కోడప సాంబయ్య, బూరం అంకులు, కొరారి రాజలింగు, లింగంపల్లి రాకేష్, రౌతు మధునక్క, బుర్రి నర్సింహులు, దూల అశోక్, ముఖషీర్ పాషా, కుడిమెత కిష్టయ్య, పున్నపురెడ్డి రాకేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, నాయకులు అశోక్, దిగిడ బక్కన్న దూల లక్ష్మి శ్యాగం కమల పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్ యువరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్‌తో కలిసి హాజరై ఖైదీలకు అవగాహన కల్పించారు. అంతకుముందు జైలు ఆవరణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో ప్రశాంతమైన జీవనం గడపాలన్నారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు, న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఖైదీలు కూడా న్యాయ సాయం పొందేందుకు కృషి చేస్తామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ సత్ప్రవర్తనతో దైవం పట్ల భక్తి భావం కలిగి ఉండాలని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని ఇక్కడి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లీగల్ ఎయిర్ కౌన్సిలర్ అంజనీ దేవి పాల్గొన్నారు.

ముగిసిన దండరీ ఉత్సవాలు



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్దలతో జరుపుకున్న దండారి ఉత్సవాలు మండలంలోని చిన్న సాకడ గ్రామంలో శనివారం కొలబోడి పూజలతో ముగిశాయి. తొమ్మిది రోజుల నుండి భోగి పూజలతో ప్రారంభమైన దండారి ఉత్సవాలు గ్రామంలో సంస్కృతి సాంప్రదాయాలతో భక్తి శ్రద్ధలతో ఎత్మసూర్ పెన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేకమైన వస్త్రధారణతో పురుషులు కాళ్లకు గజ్జెలు కట్టి కోలాట, గుస్సాడీ నృత్యాలు, మహిళలు రెలా పాట నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. ప్రత్యేకమైన వేషధారణలతో హాస్య నాటికలు ప్రదర్శించారు. ప్రతి రోజు డప్పు చప్పులతో గ్రామమంత హోరెత్తించారు. తమ గ్రామం నుండి మరోక గ్రామానికి దండరీ బృందంగా వెళ్లి తమ అతిథ్యాన్ని స్వీకరించారు. చివరి రోజు ప్రతి ఇంటింటికి వెళ్లి దండరీ బృందానికి మంగళ హారతులు ఇచ్చి ప్రతి ఇంటి నుండి ధాన్యం, బియ్యం స్వీకరించారు. అనంతరం గ్రామం బయట ఉన్న ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీలు, పోరిలు, పురుషులు, మహిళలు దండారీ దీక్షను విరమించారు. ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీ నెమలి టోపీలు, డప్పులు, కోలాట సామాగ్రి, సాంప్రదాయ వాయిద్యాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని వాగుకు వెళ్లి స్నానాలు ఆచరించి సహపంక్తి భోజనాలతో దండారి ఉత్సవాలు ముగిశాయి.

సమయ పాలన పాటించడం లేదు

నవతెలంగాణ-కౌటాల



ప్రభుత్వ కార్యాలయాలలో పని చేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదని పలువురు మండల వాసులు పేర్కొన్నారు. శనివారం ఉదయం 11:30 గంటల వరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్క కంప్యూటర్ ఆపరేటర్ తప్ప మిగతా సిబ్బంది ఒక్కరు కూడా కార్యాలయానికి రాలేదు. ఉద్యోగులు సిబ్బంది రాకపోకల వేళలను తమకు అనుకూలంగా మాత్రమే తప్ప ప్రజలకోసం ఆలోచన చేయడం లేదు. ఇక సెలవులు వస్తె మాత్రం ఒకరోజు ముందు ఒకరోజు తర్వాత కార్యాలయానికి ఎగనామం పెడుతున్నారు. అధికారులు లేక ఆఫీసులు వెలవెల పోతున్నాయి. ఇటీవల తరచుగా ఇదే పరిస్థితి ఉందని ఆఫీస్‌కి వచ్చిన పలువురు ప్రజలు అంటున్నారు. పంచాయితీ రాజ్ శాఖలో ఒక్కో మండలానికి ఎంపీడీఓ, ఎంపీఓలు రెగ్యులర్‌గా లేకపోవడం ఉన్నవాళ్ళు ఒకటి రెండు మండలాలకు ఇన్‌చార్జీలుగా ఉండడంతో ఎవరైనా అడిగితే పక్క మండలంలో ఉన్నామని చెప్పడం పరిపాటిగా మారిందంటున్నారు. ఏదేమైనా ప్రభుత్వ ఆఫీసుల్లో ఆఫీసర్లు సమయపాలన పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కాస్మెటిక్ చార్జీల పెంపుపై సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఇటీవల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కకు శనివారం మండలంలోని బూరుగూడ గ్రామ శివారులో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ధన్యవాధలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని చేతితో పట్టుకొని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులు మాట్లాడుతూ గతంలో తమకు డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు తక్కువగా ఉండేవని రేవంత్ సర్కార్ వాటిని పెంచడంతో తమకు ఇబ్బందులు లేకుండా పోయాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, లెక్చరర్లు కల్పన, వినోద, నాగరాణి, జ్యోతి, తిరుమల, స్వరాజ్యం పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కళాశాలలో

జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో ఆయా వైస్ ప్రిన్సిపాల్స్ మల్లీశ్వరి, పద్మల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కనక రాజుకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ నివాళి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గుస్సాడి నృత్యంలో పద్మశ్రీ అవార్డు పొంది ఇటీవలే మరణించిన కనకరాజుకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి నివాళులర్పించారు. మార్లవాయికి వెళ్లి కనకరాజు చిత్రపటానికి పూలమాలవేసిశ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో భాగమైన ఎత్మసూర్, దండారి సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కనకరాజు అన్నారు. తాను జిల్లాలో పనిచేసిన కనకరాజుతో ఉన్న సాన్నిహిత్యం గుర్తు చేసుకున్నారు. 55 సంవత్సరాలుగా గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శిస్తూ వందల ప్రదర్శనలు ఇచ్చారన్నారు. గుస్సాడి కళను భావితరాలకు అందించేందుకు అనేకమంది యువతకు గుస్సాడీ నృత్యం నేర్పించారన్నారు. ఆదివాసుల సాంప్రదాయక నృత్యం గుస్సాడీకి ప్రాణం పోసిన కనకరాజు చిరస్మరణీయుడని కొనియాడారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షా శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన 10 మందిని శనివారం బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆస్పత్రికి తరలించారు. వీరికి ఖర్చుల నిమిత్తం డబ్బులతో పాటు భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో వేల మందికి తమ సొసైటీ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌ఛార్జి గోపి పాల్గొన్నారు.

జిల్లాలో 34 వరి కొనుగోలు కేంద్రాలు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి వెల్లడించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఖరీఫ్ వరి ధాన్యం సమీక్షకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు. ఈనెల 15 నుండి వరి కోతలు ప్రారంభమవుతాయన్నారు. సహకార శాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గోదాంల పరిశీలన, జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశం, బ్యాంకు గ్యారంటీ, మిగిలిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేసే విధంగా చర్యలపై పర్యవేక్షించడం జరుగుతుందని మంత్రికి వివరించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ, తూకం యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తున్నందున సన్నరకం, దొడ్డు రకం దాన్యం కొనుగోలుకు వేరువేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అసిస్టెంట్ కుక్‌కు దరఖాస్తులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోనీ కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రమేష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగానికీ మండలానికీ చెందిన అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈనెల 8 సాయంత్రంలోగా దరఖాస్తులను కస్తూర్బాగాంధీ పాఠశాలలో అందజేయాలని సూచించారు.

కుల గణన సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నవతెలంగాణ-కౌటాల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే కుల గణన సర్వేపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఇందారపు పుష్పలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బందికి ఇటీవల శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. కులగణన సర్వేను చేపట్టాలని చెప్పడం జరిగిందన్నారు. సంబంధిత సిబ్బంది కులగణనపై నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నాఖాబందీ నిర్వహించిన పోలీసులు

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ సర్కిల్ పరిధిలోని ఇందారం ఎక్స్ రోడ్డులో శనివారం పోలీసులు నాఖా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలు చేసి రాంగ్ నెంబర్ ప్లేట్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వెహికల్స్‌కి జరిమానా విధించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రోడ్ల మీద వాహనాలు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఇతరులకు ప్రమాదం కలిగించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరియైన పత్రలు లేని 58 వాహనాలకు చల్లాన్స్, 02 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమములో జైపూర్ ఎస్ఐ శ్రీధర్, నాగరాజు, శ్రీరాంపూర్ ఎస్ఐలు సంతోష్, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-తాండూర్



ఎంసీపీఐ(మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా), ఆర్ఎంపీఐ (రివల్యూషనరి మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఏర్పడ్డ కమ్యూనిస్టు కో-ఆర్డినేషన్ కమిటీ(సీసీసీ) సమావేశాలు ఈ నెల 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సమావేశాల్లో 'ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-మతోన్మాద కార్పోరేట్ శక్తుల ప్రమాదం-వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశం'పై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో జాతీయ సెమినార్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌డీ డబ్ల్యూ నాయకులు దుర్గం లక్ష్మి, కామెర పద్మ, సంతోష్, అనిల్, నరేష్, వెంకట్, రాజలింగు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

తనిఖీల్లో పలు వాహనాలు సీజ్

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల జిల్లా శివారు ప్రాంతాలతో పాటు శ్రీరాంపూర్, ఇందారం, ఓపెన్ కాస్ట్ గనుల పరిసర ప్రాంతాల్లో భారీ, మధ్య తరహ వాహనాల తనిఖీ చేపట్టారు. ఇన్‌చార్జి డీటీఓ రంజిత్‌రెడ్డి, ఎంవీఐ కిషోర్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో దాదాపు 30 భారీ, మధ్యతరహ వాహనాలను పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. ఇందులో ఆరు భారీ వాహనాలు టాక్స్‌లు చెల్లించకుండా తిరుగుతుండగా మరికొన్ని వాహనాలు ఫిట్నెస్, ఓవర్ లోడ్ తదితర కారణాలతో రోడ్లపై తిరుగుతున్నాయని గుర్తించి సీజ్ చేసి, జరిమానా విధించారు. జిల్లాలో వాహన తనిఖీలు నిరంతరం సాగుతాయని అధికారులు పేర్కొన్నారు. టాక్స్‌లు చెల్లించకుండా, ఫిట్నెస్ లేకుండా రహదారులపైకి వస్తే సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు. జరిమానాల రూపంలో రవాణా శాఖకు రూ.3లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

జైపూర్ : భీమారం మండల కేంద్రంలో ఎస్సై శ్వేత వాహనాలు తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై వాహనాలను శనివారం సిబ్బందితో కలిసి తనిఖీ చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు తెలియజేశారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు.

బీసీ బిడ్డగా ఆదరించి ఎమ్మెల్సీగా గెలిపించండి

నవతెలంగాణ-జన్నారం

బీసీ బిడ్డగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజాంబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని పోకల నాగయ్య కోరారు. మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాలలో పట్టభద్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ 31 అక్టోబర్ 2021 సంవత్సరం లోపు డిగ్రీ పూర్తి అయిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓట్లు వేయడానికి అర్హులని తెలిపారు. పట్టభద్రు, ఉద్యోగ ఉపాధ్యాయులు అందరూ తమకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిరుద్యోగుల పక్షాన, పట్టభద్రుల పక్షాన తన పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, అల్లం లచ్చన్న, ఎంబడి సత్యం, ముత్యం సతీష్, అల్లం నరేష్, దాసరి తిరుపతి పాల్గొన్నారు.

గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపాలి

నవతెలంగాణ-తాండూర్

దీపావళి గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఆకాంక్షించారు. శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు దూరం రవీందర్ తో కలిసి నర్సాపూర్ గ్రామపంచాయతీ గిరిజన గ్రామం రామ్‌గూడలో దండారి ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి గుస్సాడి నృత్యం చేశారు. పండగలు సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ గ్రామాల మధ్య ప్రజల మధ్య ఐక్యత నుపెంచడానికి దోహదం చేస్తాయని తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా గిరిజనులు ఆచారంగా జరుపుకునే దండారి సాంప్రదాయం అనాదిగా వస్తుందని, గుస్సాడీ నృత్యం జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. గిరిజనుల సంస్కృతిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ విష్ణు, మాజీ ఉపసర్పంచ్ మడవి పరపత్‌రావు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, పెద్ద బోయిన మల్లేష్, ఇందూరి సత్యనారాయణ, మడావి పర్వత్రావు, అమృతరావు, తిరుపతి, భగవంత్ రావు పాల్గొన్నారు.

8న జిల్లాలో యువజనోత్సవాలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 8వ తేదీన యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజీవ్‌రు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15-35 ఏండ్ల మధ్య గల యువతీ, యువకులు వివిధ విభాగాలలో పాల్గొని జిల్లా ప్రథమ స్థానంలో వచ్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఒకేషనల్, కస్తూరిబా బాలికల విద్యాలయం, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ కళాశాలలు, పాఠశాలు, వసతిగృహాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. థమటిక్, గ్రూప్ ఫోక్ డాన్స్, గ్రూప్ ఫోక్ సాంగ్, సోలో ఫోక్ డాన్స్, సోలో ఫోక్ సాంగ్, పొయెట్రీ, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, హాండీక్రాఫ్ట్, టెక్స్‌టైల్స్, ఆగ్రో ప్రోడక్స్ ఇతర అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని యువతీ, యువకులు, జిల్లా కళాకారులు ఈ పోటీలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రానికి చెందిన గొంతు క్యాన్సర్ బాధితురాలికి చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కాసిపేట-1 ఇంక్లైన్ సర్వే డిపార్ట్మెంట్ సర్వే ఆఫీసర్ మహబూబ్‌ఖాన్, సార రాజ్ కుమార్ చేతుల మీదుగా రూ.5000 నగదు అందించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు ఆవిడపు రవీందర్, కార్యదర్శి అంకం రాయమల్లు, ప్రచార కార్యదర్శి విజయ్, సమితి సభ్యులు ఆంజనేయులు యాదవ్, గణేష్ యాదవ్, సందీప్, జూల పోషం, షకిల్, ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-నస్పూర్

పెన్షన్, మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకునేందుకు లైఫ్ సర్టిఫికెట్ కొరకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి మాజీ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం మాదిరిగానే నవంబర్ మాసంలో ప్రతి మాజీ ఉద్యోగి పెన్షన్, సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ మెడికల్ కార్డు(హెల్త్ కార్డు) రెన్యూవల్ కోసం మీ-సేవలో లైఫ్ సర్టిఫికెట్ కి దరఖాస్తు చేసుకోవాలని, లేనిచో పెన్షన్ డబ్బులు ఆగిపోవడం, మెడికల్ కార్డు వాలిడిటి అయిపోతుందని తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హై స్కూల్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు మమత మహిళా తరంగిణి అధ్వర్యంలో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు 50 మంచి నీళ్ల గ్లాసులను అందించారు. మమతా సభ్యులు రాచకొండ మంజుల, జ్యోష్న చంద్రదత్, వాణి, ప్రియా పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలు కొనసాగింపు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 28న ప్రారంభమై నవంబర్ 3వరకు కొనసాగనున్నాయి. శనివారం పౌరుల సమగ్రత ప్రతిజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్లాంట్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సర్దార్ వల్లభాయి పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. జాతి సమగ్రతలో పటేల్ కృషి, పట్టుదల అమోఘమన్నారు. అనంతరం సింగరేణి సేవా సమితిలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందే అభ్యర్థులతో పౌరుల సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం, సింగరేణి సేవా సమితి కో ఆర్డినేటర్ అరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫేయా పాల్గొన్నారు.

వర్గీకరణకు అడ్డుపడుతున్నారు..

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-జన్నారం

సుదీర్ఘ పోరాటంతోనే వర్గీకరణ సాధ్యమైందని, దాన్ని అమలు పరచకుండా కొందరు అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా దర్మయుద్ధ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజర్యారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేశామని, కొందరు స్వార్థపరులు వర్గీకరణకు అడ్డు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చి తప్పారన్నారు. మాటలతో మభ్యపెడుతున్నారని, వర్గీకరణ పూర్తయ్యే వరకు రాష్ట్ర ఉద్యోగ నియమకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షలు కొండ బ్రహ్మయ్య, నిర్మల్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి జంగం రవి, ప్రచార కార్యదర్శి ముల్కాల రమేష్, సీనియర్ నాయకులు మంద చిన్నయ్య, మామిడిపల్లి ఇందయ్య, దుమ్మల ఎల్లయ్య, దూమల్ల రమేష్, మంద రాజేష్, శ్రీపల్లి అంజన్న, కొండుకూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించి రైతుల వద్ద నుంచి వరిధాన్యం కొనుగోలు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లాలలో కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే క్రమంలో తేమ, తప్ప, తాలు ఇతర అంశాలలో పాటించవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, వరి కోత సమయంలో హార్వెస్టర్ నిర్వాహకుల సమన్వయంతో పని చేయాలని, ఆర్‌పీఎం 18 నుండి 20 వరకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, గోదాములు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, తూకం, తేమ యంత్రాలు, ధాన్యం క్లీనర్లు ఇతర అన్ని సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు తరలించే సమయంలో రవాణా, ఎగుమతి దిగుమతిలో హమాలీల నిర్వహణ ఇతర అంశాలపై పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించబడిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను దాదాపు ప్రారంభించామని, కేంద్రాలకు అవసరమైన యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రాష్ట్ర స్థాయిలో అండర్-14, అండర్-17 విభాగంలో బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోదర తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలలో అండర్-17, అండర్-14 విభాగంలో బాల బాలికల జోనల్ (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) స్థాయి బాస్కెట్బాల్ పోటీలను ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో జడ్పీహెచ్ఎస్ జెండా వెంకటాపూర్, లక్షెట్టిపేట విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. అండర్ 17 విభాగంలో ఎంపికైన విద్యార్థులు అఖిల్ 9వ తరగతి, దీక్షిత 7వ తరగతి, స్టాండ్ బై గా, శరణ్య 7వ తరగతి, ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ఈ నెల 2, 3, 4న మహబూబాబాద్‌లో నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో (బాల బాలికల) బాస్కెట్బాల్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. అండర్-14 విభాగంలో ఎంపికైన విద్యార్థులు విశాల్ 8వ తరగతి, అభి శ్రీ 7వ తరగతి, వర్ష 7వ తరగతి స్టాండ్ బై గా, హనువర్ణిక 7వ తరగతి, హర్షిత 7వతరగతి, ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 8, 9, 10 తేదీలలో హైదరాబాదులో నిర్వహించే రాష్ట్రస్థాయి(బాల బాలికల) బాస్కెట్బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను, పాఠశాల పీడీ బెల్లం శ్రీనివాస్‌ని ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

విద్యార్థులకు శాపంగా మారిన ఫీజు బకాయిలు



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుంచి రావలసిన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులుపై చదువులకై సర్టిఫికెట్లు కావాలని కళాశాలలకు వెళ్ళినప్పుడు యాజమాన్యం డబ్బులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్నారని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నిటిపై తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, అంజి, అన్వేష్, చరణ్, నికిత, సాయి, వైష్ణవి పాల్గొన్నారు.

ఎస్సీలకు 24, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్లు పెంచాలి

● అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణాలో కులగణన చేయడం చాలా అభినందనీయమని, బీసీలకు 42, ఎస్సీలకు 24, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్లు పెంచాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు కోరారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేకు ముఖ్య అతిథులుగా వచ్చిన ఎమ్మెల్యే పీఎస్ఆర్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలకు అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అత్యధికంగా దళితులు, గిరిజనులు, ఆర్థికంగా, రాజకీయంగా, సామజిక రంగాల్లో వెనక బడ్డారని, వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు భైరం లింగన్న, మాజీ మండల అధ్యక్షుడు దొంత నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్, దమ్మ నారాయణ, పెండెం సత్తన్న, వేల్పుల ప్రేమ్ సాగర్, ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, చాతరాజు రాజేష్, చాతరాజు శివ, గంధం సందీప్, నీరటి మొగిలి, చెన్న కిరణ్ పాల్గొన్నారు.



సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-తాండూర్

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీఓ అనిల్ కోరారు. స్పెషల్ ఆఫీసర్ అంజయ్యతో కలిసి శనివారం మండలంలోని గోపాల్‌నగర్, అచలాపూర్, బోయపల్లి గ్రామ పంచాయతీలో ఇంటింటికి కార్డుల అంటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు సహకరించాలని కోరారు. ఈ నెల 6 నుండి నిర్వహించే సర్వే ప్రారంభమవుతోందని తెలిపారు. నిర్ణయించిన తేదీల్లో కుటుంబాల యజమాని లేదా కుటుంబ సభ్యులు ఇంటి వద్దనే ఉండాలని సూచించారు. గణాంక అధికారులు అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయి సమాధానాలు అందించాలన్నారు. అడిగిన పత్రాలను అందించాలన్నారు. ఎన్యుమరేటర్లు సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, కుటుంబ యజమానుల వివరాలను సరిగ్గా నమోదు చేయాలనీ పంచాయతీ కార్యదర్శి, ఎన్యుమారెటర్లకు సూచించారు. వీరి వెంట వంచాయతీ కార్యదర్శులు కల్పన, వసంత, కార్తీక్ రాజు ఎన్యుమారెటర్లు రమాదేవి ఉన్నారు.

దడ పుట్టిస్తున్న గ్యాస్ గోదాం దారి

● ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఇండియన్ గ్యాస్ గోదాంకు వెళ్లే దారిని పట్టించుకునే వారు లేక గ్యాస్ కస్టమర్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్‌కి అతి చేరువులలో ఉన్న రోడ్డు ఇబ్బంది కరంగా ఉందని పేర్కొంటున్నారు. వినియోగదారులు ఎప్పుడూ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతూ ప్రయాణిస్తున్నారని అన్నారు. సంబంధిత యజమాన్యం నిమ్మకు నేరెత్తన్నట్లు వ్యవహరిస్తున్నారు. గ్యాస్ గోదాం నడిపే యాజమాన్యం ఇండ్ల మధ్యలో గ్యాస్ గోదాంను నిర్మించిన సంబంధిత అధికారులు దృష్టి పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వినియోగదారుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

ఇబ్బంది లేకుండా విద్యాబోధన సాగాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ఉపాధ్యాయులు చేపట్టే కులగణన సర్వే విద్యాబోధన కు ఆటంకం కలగకుండా నిర్వహించేలా విద్యా శాఖ ఉత్తర్వులు ఇవ్వాలని టిఎస్ యు టి ఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులూ డిమాండ్ చేశారు.శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు , విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా కులగణన సర్వే ఏర్పాట్లు చేయాలనీ కోరినప్పటికీ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే డ్యూటీ వేసి ఒకపూట బడి నడిపి మధ్యాహ్నం సర్వే చేయాలనటం ఏమాత్రం సాధ్యంకాదని టిఎస్ యు టి ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్సులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు అన్నారు.మధ్యాహ్నం సర్వేకు అనుకూలమైన సమయంకాదని, గ్రామాల్లో ఆ సమయం లో కుటుంబ సభ్యులు అందరూ ఇంటివద్ద ఉండరని తెలియజేశారు.సెలవు రోజుల్లో సర్వే చేయవచ్చన్నారు. కొందరు ఉపాధ్యాయులు ఉదయం, మరికొందరు మధ్యాహ్నం వంతులవారీగా సర్వేకు కు హాజరయ్యేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు .

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-జైపూర్

చెన్నూరు మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కొండా అశ్విత్, దాసరి సాయి గోదావరి నదిలో మునిగి మృతి చెందిన విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును శనివారం బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా గోదావరి నది స్నానానికి వెళ్లిన కొండా అశ్విత్, దాసరి సాయి నది ప్రవాహంలో మునిగి మృతి చెందినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సంఘటన జరిగిన తీరు బాధాకరమని తెలిపిన ఆయన బాదిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దుగ్నేపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మల్లేష్ మామ్మమూర్తి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలిసిన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ప్రచురించిన 'గంజాయి, కల్తీ కల్లును నిర్మూలిద్దాం-మన సమాజాన్ని కాపాడుకుందాం' అనే వాల్‌పోస్టర్‌ను చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గజపల్లి నర్సయ్య మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు గంజాయి, తెల్ల కల్లు లాంటి మత్తు పానీయాల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోకూడదని తెలిపారు. అధిక లాభం, అక్రమ సంపాదన కొరకు మత్తు పదార్థాలు అలవాటు చేయించే ప్రయత్నాలు చేస్తారని, అటువంటి వారి బారిన పడకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కుమార్, జాదవ్ సంతోష్, అనూష విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హాస్పిటల్ సిబ్బందికి సూచించారు. శనివారం మాతా శిశు ఆరోగ్య కేంద్రన్ని సందర్శించి గర్భిణులకు మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. హాస్పిటల్‌లోని స్కానింగ్, ఓపీ, రక్త, మూత్ర పరీక్ష గదులను, పరికరాలను పరిశీలించారు. వార్డుల్లో తిరుగుతూ గర్భిణుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాల్, వార్డుల్లో కరెంట్ బల్బులు, ఫ్యాన్‌లు పని చేయడం లేవని, కొత్తవి ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

కుటుంబ సర్వేలో తప్పుల్లేకుండా వివరాలు సేకరించాలి

జైపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా వివరాలు సేకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న కుటుంబ సర్వేను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లేష్, ఎన్యూమరేటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. భీమారం మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికి స్టికర్లు అంటిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి తెలిపారు. బ్లాకుల వారీగా కుటుంబాల పూర్తి స్థాయి వివరాలు సేకరించి కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | నవంబర్ 03, 2024 | www.navatelangana.com

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని చిన్న ధర్మారం గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటి చెను గ్రామానికి చెందిన మౌనిక విద్యుత్ షాక్‌తో మరణించగా ఆమె భర్తకు బ్యాంక్‌లో పీఎంజేజేబీవై ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన ఇన్సూరెన్స్ రూ.436లతో బీమా ఉండటంతో రూ.2 లక్షల చెక్కును అందించారు. కేంద్ర ప్రభుత్వ బ్యాంక్ ఇన్సూరెన్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ సాయి కృష్ణ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం రాహుల్, రాజ్ కుమార్, వీఓఏ కృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనలో బీసీలకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహించనున్న సమగ్ర కుల గణనలో బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన పకడ్బందీగా చేయాలన్నారు. జనాభా దామాషా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. మహిళ బిల్లులో బీసీలకు సబ్ కోట కేటాయించాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బిల్లులను పాస్ చేసేందుకు తహసీల్దార్ కాంట్రాక్టర్ వద్ద నుంచి లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జిల్లాలోని జైనూర్ తహసీల్దార్ దురిశెట్టి తిరుపతి కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ.12,000 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచంలోద్దికి చెందిన కాంట్రాక్టర్ కేంద్రే సుభోద్ కాంత్ రూ.9లక్షల పదివేలు కాంట్రాక్టుకు సంబంధించి బిల్లు పాస్ చేసేందుకు సదరు కాంట్రాక్టర్ దగ్గర రూ.12,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖను సంప్రదించాడు. ముందుగా పక్క ప్రణాళిక రూపొందించి రూ.12 వేల రూపాయలు లంచం ఇస్తుండగా తహసీల్దార్‌ను ఆయనకు సహకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఇంటింటి కుటుంబ సర్వేను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతోందని, నవంబర్ 6వ తేదీ నుంచి గ్రామాలలో కులగణన కార్యక్రమం ప్రారంభం కాబోతోందని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆలోచన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఆదేశాల మేరకు కులగణనపై క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శనివారం సాయంత్రం డీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజల్లోకి లోతుగా తీసుకెళ్లాలన్నారు. ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా భావించి పెద్దఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని వార్డులు, పల్లెల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ ఆలోచన విధానాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.

గుడుంబా విక్రయాలు చేపడితే చర్యలు



నవతెలంగాణ-కెరమెరి

గుడుంబా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లక్మాపూర్ గ్రామంలో గుడుంబాపై అవగాహన కల్పించారు. గుడుంబా వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. గుడుంబా కారణంగా గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. దీంతో కేసుల పాలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో గుడుంబా క్రయవిక్రయాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబాకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-బేల

మండలంలోని కాంగార్‌పూర్ గ్రామ శివారులో పెన్‌గంగా నది వద్ద ఇసుక అక్రమ రవాణ జరుగుతుందన్న సమాచారం మేరకు జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో బేల ఎస్సై డి.రాధిక, మైనింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి బేల పోలీస్ స్టేషన్‌కు తరలించామని జైనథ్ సీఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణ జరగకుండా అక్కడ ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఉరేసుకొని ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్



మనస్థాపనికి గురై జీవితంపై విరక్తి చెంది దూలనికి ఉరెసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని న్యూ సౌంలీ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలపిన వివరాల ప్రకారం.. న్యూ సౌంలీ గ్రామానికి చెందిన కొత్తిమీర భారతబాయి(32) శనివారం ఉదయం సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉన్న చీరతో దూలనికి ఉరెసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొన్ని రోజుల నుంచి భారతబాయి భర్త దయానంద్, మరిది కీర్తి రతన్ ఇద్దరు కలసి ప్రతి రోజు వేధించడంతో ఆమె ఇంట్లో ఉన్న దూలనికి ఉరెవేసుకొని ఆత్మహత్య చేసుకునట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మృతురాలి అన్న సంగే ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలున్నారని తెలిపారు.

మెస్ చార్జీలు పెంచడంతో సంబరాలు



నేరడిగొండలో ప్లకార్డులతో సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థినులు

నవతెలంగాణ-నేరడిగొండ

ప్రభుత్వం విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడంతో శనివారం మండలంలోని బుగ్గారం రెసిడెన్షియల్ హాస్టల్లోని విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పట్టుకొని రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ స్వప్న ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మెస్ చార్జీలు తక్కువగా ఉండటంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. మెస్ చార్జీలు తక్కువగా ఉండి నిత్యావసరాల ధరలు అంబారాన్ని అంటాయని తెలిపారు. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా మెస్ చార్జీలు పెంచడంతో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎంలకు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో గురుకులం ఎదుట సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థినులు

ఉట్నూర్ : ప్రభుత్వం విద్యార్థుల డైట్ చార్జీలు పెంచడంతో శనివారం గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొరిమి ప్రత్యూష ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ డైట్ చార్జీలు పెంచడంతో విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం లభించడంతో పాటు కాస్మొటిక్ వస్తువులు, తదితర వసతులు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వడ్డేపల్లి శ్రీవాణి, బుర్ర మానస, జనప్రియ, లక్ష్మీ, ప్రసన్న, లక్ష్మీ సంధ్య, సరిత, శ్రీదేవీ విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో దివంగత పీడీ గడిగొప్పుల సదానందం జ్ఞాపకార్థం మూడు రోజులపాటు నిర్వహించే 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనే శ్యాంసుందర్ రావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ ఆహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నాయని, దీనికిగాను ఉమ్మడి 10 జిల్లాల నుండి క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల క్రీడల అధికారి బండ మీనారెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కనపర్తి రమేష్, కోశాధికారి అలుగునూరి రమేష్ రెడ్డి, తెలంగాణ హ్యాండ్ బల్ అసోసియేషన్ రాష్ట్ర రెఫరీ బోర్డ్ కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి, రాయ్ సెంటర్ అధ్యక్షులు పెందొర్ సుధాకర్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆత్రం లింగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సునార్కర్ అరవింద్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్ కడతల రాకేష్, పాఠశాల ఎచ్ఎం జంగు, పిడిలు గాజుల శ్రీనివాస్, విఠల్, మధుసుదన్, విశాల, కోచ్‌లు విద్యాసాగర్, తిరుమల్ పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల ప్రత్యేక కార్యదర్శి దేవేందర్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఆయన వరి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధాన్యం భద్రపరచు గోదాములు వేరువేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 287 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను, ఇప్పటివరకు 97 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, టార్పలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తమ ధాన్యం తడవకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ధాన్యం బస్తాల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంటింటి సమగ్ర సర్వేకు సంబంధించి ఏర్పాట్లపై రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్ సుల్తానియా హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా ఇంటింటి సమగ్ర సర్వేకు సంబంధించి ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహణకు సరిపడినంతమంది ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సీపీఓ జీవరత్నం, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి అంజి ప్రసాద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఐకేపీ ద్వారా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శాంతినగర్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 3వ వారంలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు అంచనా 3,400 మెట్రిక్ టన్నుల అంచనా అని, ఏంఎస్పీ రేట్ గ్రేడ్ ఏ-2,320, కామన్ గ్రేడ్ రూ.2,300 అదనంగా సన్న రకానికి రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సివిల్ సప్లై అధికారి మహ్మద్ వాజిద్ అలీ, డీఎం సుధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి పాల్గొన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్‌కు రైటర్లకు సంబంధం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ శివారులో నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో డాక్యుమెంట్ రైటర్లకు ఎలాంటి సంబంధం లేదని, ప్రయివేట్ వ్యక్తులు చేశారని దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు ఖదీర్ తెలిపారు. శనివారం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి వివరణ ఇచ్చారు. వీరికి రియల్ ఎస్టేట్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజ్జు, వేదవ్యాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు ఖదీర్ మాట్లాడుతూ పట్టణ శివారులోని ఓ భూమిలో తప్పుడు ఎల్ఆర్ఎస్ సర్టిఫికేట్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దీనిపై పత్రికల్లో డాక్యుమెంట్ రైటర్లపై ఆరోపణలు రావడంతో తాము స్పందించమన్నారు. ఆ దస్తావేజు సంఘంలో ఏ ఒక్క వ్యక్తి కూడా రాయలేదన్నారు. ప్రయివేట్ వ్యక్తి రాసినట్టు తమకు తెలిసిందన్నారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రారర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ డాక్యుమెంట్లను రద్దు చేస్తున్నామని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. తాము ఎలాంటి అక్రమాలు, అవనితీ, నకిలి పత్రాలతో దస్తావేలు తయారు చేసి ఇవ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, రాజు, క్రిష్ణ, ముదస్సిర్ షా, సమీర్, సహెర్, హాజీ, షహెబాజ్, సలీం, జునేద్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవి

నవతెలంగాణ-బేల

ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం మండలంలోని పోనాలా, దేవుజిగుడాలో ఏర్పాటు చేసిన దండారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆదివాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ఒక గ్రామం నుండి ఇంకో గ్రామానికి దండారి బృందాలు సందర్శిస్తూ సంస్కృతిని కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో బేల మండల బీజేపీ అధ్యక్షులు దత్త నిక్కం, వట్టిపెల్లి ఇంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని న్యూసాఖి గ్రామానికి చెందిన యువకుడు తొంబరె మాధవ్ (21) అదృశ్యమైన కేసు నమోదు చేశామని ఏఎస్సై వసంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తొంబారె లక్ష్మన్ కుమారుడు మాధవ్ రెండు రోజుల క్రితం తన స్నేహితులను కలిసి వస్తానని ఇంటి నుండి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని తండ్రి లక్ష్మన్ శనివారం ఫిర్యాదు చేశాడు. దీంతో యువకుడు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఖానాపూర్

యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని, మనిషి ఆరోగ్యవంతంగా ఉండటానికి ప్రతి రోజు యోగ చేయడం ఎంతో ముఖ్యమైందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో జరిగిన యోగ ఎంపిక పోటీల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా మనిషి ఆరోగ్యంగా ఉంటాడని, రోగాలు వచ్చే అవకాశం ఉండదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో 4 మండలాలకు ఒక మండల విద్యాధికారి ఉండేవారని, కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి మండలానికి ఒక మండల విద్యాధికారిని నియమించడం జరిగిందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించిందన్నారు. విద్యార్థులు జాతీయస్థాయి యోగ పోటీలో రాణించాలన్నారు. రూ.70లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం...

మండలంలోని మస్కాపూర్, పాత ఎల్లాపూర్ గ్రామాలతో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంటలను ప్రభుత్వం కేంద్రాల వద్ద అమ్మాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. త్వరలో రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023 ఎన్నికల సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ సభలో హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారన్నారు. పది నెలలు అవుతున్న ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదన్నారు. దాని కారణంగా తమ ఉద్యోగానికి రాజీనామ చేసి సమగ్ర ఉద్యోగుల తరపున ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబడ్డామన్నారు. ఉమ్మడి జిల్లాలో లక్షల మంది గ్రాడ్యుయేట్‌లు ఉన్నప్పటికీ నేటికీ కనీసం 15 వేల ఓట్లు కూడా నమోదు కాకపోవడం చాలా బాధాకరమని అన్నారు. జిల్లాలో వేలాది సంఖ్యలో ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు, మెడికల్ సిబ్బంది, అన్ని విభాగాల్లో ప్రభుత్వ విభాగాలు ప్రయివేట్ విభాగాలు అత్యున్నత ప్రమాణాలతో చదువుకొని, ఉన్నప్పటికీ తమ ఓటు నమోదులో నిర్లక్ష్యాన్ని విడనాడాలని కోరారు. ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. మీ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో గాని లేదా ఆయా కేంద్రాల్లోకి వెళ్లి ఈనెల 6వ తేది వరకు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

బంజారా మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని రాజులగూడ పంక్షన్ హాల్‌లో శనివారం బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ ఆధ్వర్యంలో బంజారా మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. మండలంలోని ఆయా తండాల నుంచి లంబాడి గిరిజనులు కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఈ ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం లంబాడీల జాతి ప్రయోజనం కోసం సమాజ జాగృతితో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు సంఘం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మండలాధ్యక్షుడిగా జాదవ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ దిలీప్, ఉపాధ్యక్షులుగా రాక్రు నాయక్, జాదవ్ జైపాల్ సింగ్, సహాయ కార్యదర్శిగా రాథోడ్ రమేష్, పవార్ భరప్ సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ ఆడే సురేష్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, రాథోడ్ మధుకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్, వివిధ గ్రామాల పెద్దలు ఉన్నారు.

రూ.20వేల విలువగల మైక్‌సెట్ అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేవాపూర్ గ్రామంలోని మహంకాళి ఆలయానికి గ్రామస్తుల కోరిక మేరకు దాదాపు రూ.20వేల విలువ గల మైక్ సెట్‌ను శనివారం ముడుపు మౌనిష్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మౌనిష్‌రెడ్డి మాట్లాడుతూ దేవాపూర్ గ్రామస్తులు మహంకాళి ఆలయానికి మైక్‌సెట్ అందించమని కోరగా రూ.20వేల విలువగల మైక్‌సెట్‌ను అందజేసినట్టు తెలిపారు. దేవాపూర్ గ్రామస్తులు కుల మతాలకతీతంగా కలిసికట్టుగా ఉండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దేశానికి పట్టుకొమ్మలే గ్రామాలన్నారు. అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమేందర్‌రెడ్డి, శివాజీ, పురుషోత్తం, ముడుపు కేదారీశ్వర్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్, మహేందర్, మాజీ సర్పంచ్ అబ్దుల్లా, సంతోష్, కిరణ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

